క్లుప్తంగా

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న ఆర్యవైశ్యులు

జగిత్యాలటౌన్: ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తూ జగిత్యాల ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఆదివారం జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జువ్వాడి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

తాట్లావాయిలో శ్రీరామ స్తూపం ఆవిష్కరణ



పూజలు చేస్తున్న వేదపండితులు

రాయికల్: మండలంలోని తాట్లావాయిలో సీతారామచంద్రస్వామి వరదాద్రి ఆలయంలో శ్రీరామ స్తూపం ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా ఆదివారం వేద పడింతులు రంగాచార్య వేణుగోపాలచార్య, అనంతచార్య, శ్యాంసుందరచార్య, ధ్రువ కౌండిన్యల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

విద్యార్థుల విజ్ఞాన యాత్ర



కరీంనగర్ డెయిరీ వద్ద విద్యార్థులు

ధర్మపురి: పీఎం శ్రీ స్కీం పాఠశాలల ఉన్నతీకరణ, సౌకర్యాల పెంపు పథకం కింద ఎంపికైన మండలంలోని మగ్గిడి మోడల్ స్కూల్ విద్యార్థులు ఆదివారం విజ్ఞానయాత్రకు వెళ్లారు. ప్రిన్సిపాల్ బుచ్చన్న ఆధ్వర్యంలో విద్యార్థులకు జిల్లాలోని అనేక పర్యాటక స్థలాలు సందర్శించారు. కరీంనగర్ డెయిరీ ని సందర్శించి పాలను ఏ విధంగా పాకెట్ల రూపంలో అందిస్తున్నారని ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అదే విధంగా కరీంనగర్‌లోని జింకల పార్కు, ఉజ్వల పార్కు, తీగలవంతెన, డ్యాం తదితర వాటిని సందర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులున్నారు.

క్రికెట్ టోర్నీ విజేత భూషణరావుపేట



విజేతగా నిలిచిన భూషణరావుపేట జట్టు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో కేఎంపీఎల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి క్రికెట్ టోర్నీ విజేతగా భూషణరావుపేట జట్టు విజయం సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భూషణరావుపేటకు చెందిన శ్రీరాం రైజెస్, సిరికొండకు చెందిన సూపర్ కింగ్ జట్లు తలపడ్డాయి. విజేతగా భూషణరావుపేట జట్టు, రన్నరప్‌గా సిరికొండ జట్టు నిలిచాయి. విజేతలకు నగదు బహుమతి, జ్ఞాపికలను నిర్వాహకులు అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, మండల క్రీడాకారులు పాల్గొన్నారు.

నవోదయకు ఎంపికైన విద్యార్థులు



విఘ్నేశ్వర్ గౌడ్

వెల్గటూర్: ఎండపల్లి మండలం గుల్లకోట ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న పొన్నం విఘ్నేశ్వర్ గౌడ్ నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి నవోదయకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం చందూరి రాజిరెడ్డి, గ్రామస్తులు విద్యార్థికి శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల అధ్యాపక బృందాన్ని హెచ్.ఎం రాజిరెడ్డి అభినందించారు.

వేములకుర్తిలో విద్యార్థికి..

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి గ్రామానికి చెందిన కుమ్మరిపెల్లి కార్తీక్ అనే విద్యార్థి నవోదయ స్కూల్‌లో సీటు సాధించినట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. కార్తీక్ న్యూవిజన్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నారు. అదే పాఠశాలలో కోచింగ్ తీసుకున్నారు. విద్యార్థి కార్తీక్‌ను ప్రిన్సిపాల్ తిరుపతి, గ్రామస్తులు అభినందించారు.

కొత్త వంతెన నిర్మాణమెప్పుడో?

- శిథిలావస్థలో పాత వంతెన
- నిర్మిస్తే మండలాలకు ప్రయోజనం
- దశాబ్దాల తరబడి ఎదురుచూపులు



మద్దునూర్ గ్రామ శివారులో శిథిలావస్థలో వంతెన

బుగ్గారం: 'పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు' గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుంది. అనే మాటలు తరచుగా నాయకుల నోటి నుంచి వినిపిస్తుంటాయి. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యమని నాయకులు ఊదరగొడుతుంటారు.కానీ క్షేత్రస్థాయిలో సరైన మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
మండలంలోని మద్దునూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై గ్రామ శివారులో వాగుపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. దీంతో ఈ మార్గం గుండా ప్రయాణించే వివిధ గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
ఏళ్ల క్రితం కట్టిన వంతెన కావడంతో వర్షాకాలం వాగులో నీరు అధికంగా ప్రవహించేటప్పుడు కింద బండరాళ్లు తొలగిపోయి ఉపరితలంలో గొయ్యి ఏర్పడింది. అంతేకాకుండా బండరాళ్లు తేలి వాహనాలు ప్రయాణించడానికి అసౌకర్యంగా మారాయి. రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు ఇదే మార్గంలోని మరోచోట రోడ్డు పూర్తిగా కోతకు గురై ఇరుకుగా మారింది. ఈ ప్రాంతంలో ఎదురెదురుగా వాహనాలు వచ్చేటప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి.

అనేక గ్రామాలకు ప్రయోజనకరమైన మార్గం

ఈ మార్గం గుండా బుగ్గారం మండలంలోని గోపులాపూర్,బీర్‌సాని,సిరికొండ,శెకెల్ల గ్రామాలతో పాటు ప్రక్క మండలాలైన వెల్గటూర్,గొల్లపల్లి,ధర్మపురి మండలంలోని అనేక గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు.వంతెన శిథిలావస్థకు చేరడంతో రాత్రిళ్లు ప్రయాణించే వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పొలాలకు వెళ్లే రైతులు తమ ఎడ్లబండ్ల ద్వారా వెళ్లేటప్పుడు వంతెనపై తేలిన పెద్ద పెద్ద బండరాళ్లతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. క్రింది భాగంలో కుంగిన బండరాళ్లతో మధ్యలో ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు కూడా జరిగినట్లు స్థానికులు తెలిపారు. వర్షాకాలంలో నీటి ప్రవాహం పెరిగినప్పుడు వంతెన మరింతగా శిథిలమయ్యే అవకాశం ఉంది కనుక అధికారులు వెంటనే నూతన వంతెన నిర్మాణానికి కృషి చేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

వంతెన నిర్మించాలి



దశాబ్దాల క్రితం కట్టిన వంతెన కావడంతో శిథిలావస్థకు చేరింది.దీంతో వాహనాలు ప్రయాణించడానికి తీవ్ర అసౌకర్యంగా ఉంది.రాత్రిపూట నూతన ప్రయాణించేవారు చాలా సంధర్భాల్లో అదుపుతప్పి కింద పడిన సందర్బాలు ఉన్నాయి.కావున అధికారులు,ప్రజాప్రతినిధులు స్పందించి నూతన వంతెన నిర్మాణానికి కృషి చేయాలి. – రంజిత్‌రావు,మద్దునూర్ గ్రామస్తుడు

వర్షాకాలంలో భయంగా



వంతెన కుంగినందునా వర్షాలు అధికంగా కురిసిన సమయాల్లో దీనిపై నుంచి వెళ్లాలంటే ప్రజలు భయం భయంగా వెళ్లాల్సి వస్తుంది.వ్యవసాయదారులు చాలా ఇబ్బందులను ఎదుర్కొనాల్సి వస్తుంది.ఈ వంతెన గనుక కూలినటైతే అనేక గ్రామాలకు రాకపోకలు జరిపేవారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి.
– పాకాల శ్రీనివాస్‌గౌడ్.మద్దునూర్

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం

మద్దునూర్ గ్రామానికి వెళ్లే ఈ వంతెనతో పాటు వెనుగుమట్ల గ్రామ సమీపంలోని మరో వంతెన నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించాం. వంతెన నిర్మిస్తే చాలా గ్రామాలకు ప్రయోజనంగా ఉంటుంది. మేము పంపిన నివేదిక ప్రకారం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే నూతన వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.
– భోగ సతీష్,ఆర్ అండ్ బీ ఏఈఈ

కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ కౌన్సిలర్, ఎంపీటీసీ



కాంగ్రెస్‌లో చేరుతున్న కౌన్సిలర్ లక్ష్మీనారాయణ

కోరుట్ల రూరల్: కోరుట్ల మున్సిపల్ మూడో వార్డు కౌన్సిలర్ మోర్గాడ్ లక్ష్మీనారాయణ, యూసుఫ్‌నగర్ ఎంపీటీసీ గుగ్గిళ్ల ప్రియాంక, ఆమె భర్త సురేశ్ గౌడ్ బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగారావు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కళ్యాణ్, గ్రామ శాఖ అధ్యక్షుడు అచ్చ చంద్రశేఖర్ కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ గౌడ్, కొంతం రాజం, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మల్లాపూర్: మండలంలోని రేగుంటలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బద్దం శేఖర్‌రెడ్డి(సిరిపూర్) మామ నేరేళ్ల రాజరెడ్డి(65) అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకోగా, పీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రాజరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జెట్టి లింగం, ఇట్టెడి జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'జీవన్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదు'

జగిత్యాలటౌన్: సుధీర్ఘకాలంగా రాజకీయాల్లో కొనసాగుతున్న నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిపై ఎంపీ ధర్మపురి అరవింద్ తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి షేర్ నర్సారెడ్డి హెచ్చరించారు. మతి భ్రమించిన ఎంపీ అరవింద్ సంచలనాల కోసమే మత విద్వేషాలు రెచ్చగొట్టేలా పిచ్చి పిచ్చి కామెంట్స్ చేస్తున్నారని నర్సారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజామాబాద్ ఎంపీ అభ్యర్థిగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేరు ప్రకటించడంతోనే తన ఓటమిని ముందే గ్రహించిన అరవింద్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో గెలిస్తే 5రోజుల్లో పసుపుబోర్డు ఏర్పాటు చేస్తామని బాండ్ పేపర్ రాసిచ్చి ప్రజలను మోసం చేసిన అరవింద్ ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రధాని మోదీ చేత ప్రకటన చేయించిన పసుపు బోర్డు మంజూరు గెజిట్ పేపర్లకే పరిమితై ఆరు నెలలు గడుస్తుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎంపీ మాటలను నమ్మకనే కోరుట్ల ప్రజలు ఓడించారని గుర్తు చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోనూ అరవింద్‌కు ఓటమి తప్పదని, జీవన్‌రెడ్డికి ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

'జువ్వాడి' విలువలతో కూడిన రాజకీయం చేశారు



రత్నాకర్ రావు చిత్ర పటం ఆవిష్కరిస్తున్న విప్

కోరుట్ల: మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు విలువలతో కూడిన రాజకీయం చేశారని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని జువ్వాడి భవన్‌లో రత్నాకర్‌రావు చిత్ర పటాన్ని విప్ ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. జువ్వాడి రత్నాకర్ రావు పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పని చేశారని పేర్కొన్నారు.

రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలి



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సహకార అధికారులు

జగిత్యాల రూరల్: రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని జగిత్యాల సహకార సంఘం సీఈవో వేణు అన్నారు. మండలంలోని పొరండ్ల, లింగంపేట, నర్సింగపూర్, మోరపల్లి, హన్మాజీపేట, గొల్లపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తేమ శాతం నిబంధనలకు అనుగుణంగా ఉన్నప్పుడే ధాన్యం కేంద్రాలకు తీసుకురావాలన్నారు. విండో డైరెక్టర్లు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పెగడపల్లి: మండల కేంద్రంలోని సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెగడపల్లి, ఏడుమోటలపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం నిర్వాహకులు ప్రారభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యమైన ధాన్యం తెచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని రైతులను కోరారు. కార్యక్రమంలో సీఈవో తడుకమడ్ల గోపాల్‌రెడ్డి, సిబ్బంది అనిల్, హైమద్, అంజనేయులు పాల్గొన్నారు.

టెట్రా నూతన కార్యవర్గం

కోరుట్ల: పట్టణంలో తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్, టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా ఎస్. వి శంకర్, గౌరవ అధ్యక్షుడిగా మేడి కిషన్, ఉపాధ్యక్షుడిగా నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వర్ రావు, ఆర్థిక కార్యదర్శిగా కాంతారావు, అదనపు కార్యదర్శిగా లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. వీరితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం



మల్యాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మిత్రులు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట జెడ్పీ హైస్కూల్‌లో 1992–93 విద్యాసంవత్సరం పదో తరగతి పూర్తిచేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశం నిర్వహించుకున్నారు. 31 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు ఆనందోత్సవాల మధ్య గడిపారు. అప్పట్లో పాఠాలు చెప్పిన గురువులను గుర్తు చేసుకున్నారు. సామూహికంగా భోజనాలు చేసి సమావేశాన్ని ముగించేశారు.

20 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు..

మల్యాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 2003–2004లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 20 ఏళ్ల అనంతరం ఆదివారం స్థానిక కేఎస్‌జీ గార్డెన్స్‌లో 60 మంది పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలుసుకున్నారు. కార్యక్రమంలో మర్రి మహేశ్, గొట్టె రమేశ్, బోగ రమేశ్, లక్ష్మీనారాయణ, గుండేటి సంతోష్, శ్రీకాంత్, విజయ్, రాజశేఖర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

తక్కళ్లపల్లిలో..

మల్యాల మండలం తక్కళ్లపల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 2006–2007 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించి, ఉపాధ్యాయులను సన్మానించారు.



మల్యాల మండలం తక్కళ్లపెల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



భూషణ్‌రావు పేటలో పూర్వ విద్యార్థులు



కథలాపూర్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఘనంగా ఈస్టర్ వేడుకలు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట, కథలాపూర్, తాండ్ర్యాల చర్చీల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సామూహికంగా భోజనాలు చేశారు. ఈ వేడుకల్లో పాస్టర్లు గసికంటి సామ్యేల్, గాంధారి లక్ష్మినారాయణ, మిట్టపెల్లి కిషన్, పాలెపు రాజేశ్, కూన అశోక్ సందేశాలిచ్చారు.

పెగడపల్లి మండలంలో..

పెగడపల్లి: మండలంలోని పలు గ్రామాల్లోని క్రైస్తవులు ఈస్టర్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున గ్రామాల్లో వీధుల వెంట కొవ్వొత్తులు వెలిగించి ఏసుక్రీస్తు పునరుత్థాన్ని గుర్తు చేస్తూ పాటలు పాడుతూ ర్యాలీ తీశారు. అనంతరం చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వరి కోతలు షురూ..



వరి కోస్తున్న హార్వేస్టర్

పెగడపల్లి: రబీ సీజన్‌లో సాగు చేసిన వరి కోత మొదలయింది. ఈ ఏడాది సీజన్ ఆరంభంలో రబీ పనులకు శ్రీకారం చుట్టిన రైతులు ఎస్సారెస్పీ ప్రాజెక్టు, చెరువులు, కుంటలు, వ్యవసాయబావుల ఆధారంగా ఎక్కువ శాతం మంది రైతులు వరి సాగునే ఏంచుకున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 25 వేల ఎకరాల్లో వరి సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. వరి పంట కోతకు రావడంతో రెండు రోజులుగా రైతులు హార్వెస్టర్‌ల సహాయంతో కోతలు ప్రారంభించారు. వాతావరణంలో వస్తున్న మార్పును గమనిస్తున్న రైతులు తమ పంటలను చేతికి దక్కించుకునేందుకు ముందుస్తుగానే రైతులు అప్రమత్తమవుతున్నారు. కోసిన ధాన్యాన్ని వెంట వెంటనే ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న ధాన్య కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల స్థలాలను చదును చేసి రైతులకు అవసరమగు సౌకర్యాలు కల్పించాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

విద్యార్థుల పల్లె బాట



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

జగిత్యాల రూరల్: మండలంలోని తాటిపల్లిలో జగిత్యాల పట్టణంలోని జ్యోతి హైస్కూల్, ఐఐటీ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం మన ఊరు మన ఆత్మగౌరవం పేరిట పల్లెదనం ప్రతిబింబించేలా వినూత్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. పల్లె వాతావరణాన్ని వివరించేలా వారు చేసిన కార్యక్రమాలు ఆలోచింపజేసాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు హరిచరణ్‌రావు, శ్రీధర్‌రావు, రజితారావు, మౌనికరావు, ఎంపీటీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చదువుల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు

మెట్‌పల్లి: విద్యార్థులు చదువుల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని జ్ఞానోదయ డిగ్రీ, పీజీ కళాశాలలో చివరి సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్, దొంతుల శివకుమార్, బండారి కమలాకర్, సంతోష్, రాజు తదితరులున్నారు.

ఘనంగా వీడ్కోలు సంబరాలు

జగిత్యాల రూరల్: జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేటలోని సూర్య గ్లోబల్‌స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు ఆదివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టరు శ్రీధర్‌రావు, రజితారావు , హరిచరణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు

మల్లాపూర్: మండలంలోని వెంకట్రావ్‌పేటలో ఆదివారం వృద్ధుడు జవిడి దేవారెడ్డిపై దాడి చేసిన ఘటనలో వేంపల్లికి చెందిన బోదాసు రాజంపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్‌రాజు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం వెంకట్రావ్‌పేటకి చెందిన జవిడి నారాయణ తన పశువుల పాకలో నిల్వ ఉంచిన మిర్చికి కాపాలాగా తండ్రి దేవారెడ్డి ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం వేకువజామున వేంపల్లి గ్రామానికి చెందిన బోదాసు రాజం పశువుల పాకలోకి వచ్చి మిర్చిని దొంగలిస్తుండగా, గమనించిన దేవారెడ్డి అడ్డుకుని మిర్చిని ఎందుకు దొంగిలిస్తున్నావని ప్రశ్నిస్తుండగానే.. నన్నే దొంగ అంటవా అని.. రాజం కర్రతో వృద్ధుడు దేవారెడ్డిపై దాడి చేయగా తలకు తీవ్ర గాయమైంది. దేవారెడ్డి అరవడంతో రాజం అక్కడి నుంచి పారిపోయాడు. బాధితుడి కుమారుడు నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయనున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వర్‌రాజు తెలిపారు.

మద్యం పట్టివేత

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ చౌరస్తాలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న జుంభర్తి రవి అనే వ్యక్తిని పట్టుకుని అతని నుండి 8 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు. అలాగే చిలుకవాడకు గిన్నెల రవీందర్ వద్ద మరో 26 లీటర్ల అక్రమంగా నిలువ ఉంచిన బీర్లను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏబీవీపీ నాయకులు

రాయికల్: పట్టణంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించే 'సింగిడి కలల హరివిల్లు' అనే వాల్ పోస్టర్‌ను నాయకులు ఆదివారం ఆవిష్కరించారు.ఏప్రిల్ 20, 21 తేదీల్లో ఉస్మానియా యూనివర్సిటీలో ఏబీవీపీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. అంతరించిపోతున్న పాత పద్ధతులను ఆచరణలోకి తేవాలని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మనోజ్, శ్రావణ్, మణితేజ పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతి..



సిరివంచకోట రోడ్డులో బండరాయి

బుగ్గారం: మండల కేంద్రం నుంచి సిరివంచకోట మీదుగా వెల్గొండ వరకు నిర్మించిన బీటీ రోడ్డుకు ఓ మూల మలుపు వద్ద అతి సమీపంగా ఉన్న పెద్ద బండరాయి ప్రమాదకరంగా మారింది. రోడ్డు నిర్మించేటప్పుడు దీనిని తొలగించకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదకరమైన మూల మలుపును కలిగి ఉంది.అయినప్పటికీ ఇక్కడ ఉన్న బండరాయిని తొలగించలేదు.దీంతో ఈ ప్రాంతం గుండా వెళ్లేటప్పుడు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. వెంటనే బండరాయిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.